క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



దుర్గం శేఖర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న దుర్గంట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల పెద్ద పోచమ్మ తల్లి ఆలయ గోపురం నిర్మాణం కోసం ఆదివారం తనవంతుగా రూ.51 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మామిడి లక్ష్మణ్, అధ్యక్షుడు బైన్వార్ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లుల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు సురేశ్, ఉప కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి సురేందర్, దుర్గం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు పంట బీమా చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: రబీ పంటలు వేసిన రైతులు తమ పంటలకు బీమా చేయించుకోవాలని లోటస్ కంపెనీ ప్రతినిధి గంద్రత్ సంతోష్ ఒక ప్రకటనలో కోరారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో వాతావరణంలో అనేక మార్పులు జరుగుతాయన్నారు. పంటలకు రక్షణగా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ రూ.499కే ఎకరానికి వాతావరణ ఆధారిత, అడవి జంతువులతో పంట నష్టానికి సంబంధించిన రెండు విపత్తులను దృష్టిలో ఉంచుకుని సరళీకృతమైనా పద్ధతుల్లో రైతు ఫోన్ నుంచే ఇన్సూరెన్స్ చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గుడిహత్నూర్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువసేన, హిందూవాహిని, శ్రీరాంసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు లోఖండే అనిల్, సందీప్ కేంద్రే తెలిపారు. యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. రక్తదాతల కోసం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వీరంతా స్థానిక శివ కళ్యాణ మండపానికి ఉదయం 11 గంటలకు సకాలంలో చేరుకోవాలని కోరారు.

డీఎస్పీని కలిసిన హిందూ ఉత్సవ సమితి నాయకులు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎల్.జీవన్‌రెడ్డిని సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తామన్నారు.

జగదాంబ దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పరిమండల్ జగదాంబ దేవిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరను సందర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఆలయంలోని వేంకటేశ్వర స్వామి విగ్రహం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. మొదటి రెండు రోజులు ధ్వజారోహణం, అర్చన, హోమం, అగ్నిప్రతిష్ఠ వంటి పూజలు నిర్వహించనున్నారు. చివరి రోజు వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. స్వామి వారి కల్యాణం వీక్షించేందుకు అధికసంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయకమిటీ సభ్యులు కోరారు.

ఆయకట్టుకు అందని సాగునీరు

- సోన్‌కాస్ చెరువులో పేరుకుపోయిన పూడిక
- మూసుకుపోయిన తూములు
- రబీ సీజన్‌కు అందని సాగునీరు



సోన్‌కాస్ చెరువులో పేరుకుపోయిన మట్టి

బేల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ హయాంలో మండలంలోని సోన్‌కాస్ గ్రామ శివారులో సూమారు 80 ఎకరాల్లో రూ.10కోట్ల నిధులతో 150 0 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చెరువు నిర్మాణం చేపట్టారు. కానీ అప్పటి నుంచి ఇప్పటిదాకా పూడిక మాత్రం తీయలేదు. దీంతో చెరువులో మట్టి పేరుకుపోయింది. అలాగే తూములు సైతం పూడుకుపోయాయి. 2012 సంవత్సరంలో రెండేళ్ల వరకు పరిరక్షణ కమిటీ ఉండగా.. ఆ తర్వాత ఎటువంటి పరిరక్షణ కమిటీ లేదు. దీంతో కోట్ల వ్యయంతో నిర్మించిన చెరువు సాగునీరు అందించలేని దుస్థితిలో ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రబీ నీరందని వైనం..

చెరువులో ఒకసారి కూడా పూడికతీత తీయకపోవడంతో మట్టి పేరుకుపోయింది. మూడేళ్ల నుంచి రెండు తూములు సరిగా పనిచేయడం లేదు. వ్యవసాయ సాగుకు ఏ మాత్రం నీరు నిల్వ లేకుండా పోయింది. నిధులు రూ.45 లక్షల వ్యయంతో చెరువు నుంచి ఎడమ వైపు మూడు కిలోమీటర్ల వరకు చప్రాల శివారు వరకు, కుడివైపు మరో రెండు కిలోమీటర్లు పిటగావ్ శివారు వరకు కాలువలు తవ్వారు. ఆ కాలువలకు సీసీ వేయకపోవడంతో పూడుకుపోయాయి. దీంతో ఆయకట్టుకు ఒక ఎకరానికి సాగునీరు అందే వీలు లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. చెరువు సమస్యలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో మూడేళ్ల నుంచి రైతులు రెండో పంట వేయలేక పత్తి చేన్లను పశువులకు మేతకు వదిలేస్తున్నారు.

చెరువు పరిరక్షణ కమిటీ లేదు..

చెరువు ప్రారంభమైన క్రమంలో రెండేళ్ల వరకు పరిరక్షణ కమిటీ ఉండేది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పట్టింపు లేకపోవడంతో చెరువు పరిరక్షణ లేకుండా పోయింది. దీంతో చెరువు సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందడం కష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు.

తూములు పని చేయడం లేదు



సోన్‌కాస్ చెరువుకు ఉన్న రెండు తూములు పని చేయడం లేదు. దీంతో చెరువులో గత మూడేళ్ల నుంచి నీళ్లు ఆగడం లేదు. రబీ సీజన్‌లో వ్యవసాయ సాగుకు ఏమాత్రం నీరు అందడం లేదు. సంబంధిత అధికారులు తూములకు మరమ్మతులు చేయించాలి.

– భోజారెడ్డి, ఆయకట్టు రైతు

కాలువలు నిర్మించాలి



ఈ చెరువు నుంచి చప్రాల, పిటగావ్ గ్రామాల శివారుల వైపుకు రెండు కచ్చ కాలువలు తవ్వారు. కానీ సీసీ నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో కాలువలు పూడుకుపోయాయి. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన చెరువు ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.

– పాయల్ శ్రీనివాస్, ఆయకట్టు రైతు

అ'పూర్వ' సమ్మేళనం



ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపాల్‌గూడ పాఠశాలకు చెందిన 2003– 2004 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన చిన్ననాటి మిత్రులు ఒకచోట కలుసుకోని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో గడిపిన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి విద్యార్థుల్లో ఇద్దరు అన్నదమ్ముళ్లకు ఆర్మీలో ఉద్యోగాలు రాగా వారిని సన్మానించారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు.

సేవాలాల్ జయంతి విజయవంతం చేయండి



ఇచ్చోడ: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



నేరడిగొండ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: ఈనెల 20న ఉదయం 11 గంటలకు ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చౌహాన్ వినాయక్‌రావు కోరారు. ఆదివారం ఇచ్చోడలో జయంతి కరప్రతాలు ఆవిష్కరించారు. ఉత్సవాలకు జిల్లా కేంద్రంలో రాంలీల మైదానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బంజారాలు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాథోడ్ బాబురావు, రాథోడ్ శివలాల్ నాయక్, ఆడే మానాజీ, జాదవ్ రమేశ్, రాథోడ్ ప్రకాశ్, జాదవ్ బలిరాం, చౌహాన్ నికిలేష్ నాయక్ పాల్గొన్నారు.

నేరడిగొండ: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ జయంతి పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈనెల 20న జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ తెలిపారు. బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వసంత్ రావ్, గోవర్ధన్, భీమ్‌జీ నాయక్, వసంతరావు నాయక్, రవీందర్, మహేందర్, అంబాజీ, సోమేశ్వర్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

- వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు



హాజరైన భక్తులు

జైనథ్: మండలంలోని కూర గ్రామంలో వెలిసిన శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు కల్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కన్నుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు పద్మావతి, అలివేలుమంగ అమ్మవార్ల సమేతుడైన స్వామి వారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవార్లను ముస్తాబు చేసి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకుముందు గరుడపూజ, గరుడ ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం గరుడ వాహనంలో స్వామి వారి విగ్రహాలను ఉంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. భారీగా భక్తులు తరలిరావడం జన సంద్రంగా మారింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా భగవాన్



భగవాన్

గుడిహత్నూర్: తుడుందెబ్బ మండల అధ్యక్షుడిగా మాన్కాపూర్‌కు చెందిన కోవ భగవాన్‌ను ఆదివారం జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా కుడ్మెత జంగు, ఉపాధ్యక్షుడిగా కాత్లె పరుశురాం, తొడసం మహేష్, మెస్రం గంగాధర్, మడావి కేశవ్, ప్రధాన కార్యదర్శిగా పెందూర్ జగన్, కార్యదర్శులుగా కొడప రామకృష్ణ, మడావి భీంరావ్, మర్సకోల జైతు, ప్రధాన కార్యదర్శులుగా చీర్‌మడే మంజాజీ, గోడం హన్మంత్‌రావ్, తొడసం గోద్రు, కొమురం నగేశ్, సిడాం మాధవ్, సాంస్కృతిక కార్యదర్శిగా సెడ్మకి గణేష్, సలహాదారులుగా పెందూర్ జలపత్ రావ్, కాత్లే భ రత్, పెందూర్ జంగు, కు మ్ర యువ రాజ్‌లను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు తెలిపా రు. సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెందూర్ జలపత్‌రావ్, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, మెస్రం నాగ్‌నాథ్, ఆత్రం భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహం తీర్చే ప్రయత్నం చేయాలి

బోథ్: వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. గతకొంత కాలంగా సేవ్ బర్డ్ సేవ్ నేచర్ నినాదంతో గ్రామాల్లో, పాఠశాలల్లో ఆయన అవగాహన కల్పిస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన ఇమ్రాన్ అనే యువకుడు హర్యానా రాష్ట్రం నుంచి స్పారో ఫౌండేషన్ నుంచి తెప్పించిన పక్షి గూడులను ఆదివారం వెంకటేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మీర్ ఇర్షద్ అలీ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సిరికొండ: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉపాధిహామీ నిధులతో ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఇమామ్ సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణలోని ప్రతీ పల్లెను అభివృద్ధి పథం నడిపించడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బోడ్డు నవీన్, కాంగ్రెస్ నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

కొలాం ఆదివాసీలు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొలాం ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కొలాం ఆదివాసీలు రాజకీయాల్లో రాణించాలని కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు అన్నారు. ఆదివారం మండలంలోని పోతగూడ గ్రామంలో మాట్లాడారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న కొలాం తెగ అభివృద్ధికి గత కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. చట్టసభలలో కొలాం తెగకు చెందిన వారు లేకపోవడంతో తమకు ప్రాధాన్యత లభించడం లేదన్నారు. కొలాం తెగకు చెందిన వారు ఎస్టీ రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పీవీటీజీల అభివృద్ధి కోసం కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీడీఏకు నిధులు మంజూరు చేస్తున్నా.. వాటిని సకాలంలో ఖర్చు చేయకపోవడంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతుందన్నారు. కార్యక్రమంలో కొలాం సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సొనేరావ్, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు టేకం గణేష్, టేకం ముత్త, మడావి జంగు, మడావి కిషన్ పాల్గొన్నారు.

'రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలి'



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఉట్నూర్‌రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే రైతాంగానికి మేలు జరుగుతుందని జిల్లా ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ ధర్నాలు చేస్తుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జి చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం రైతులను అణగదొక్కే చర్యలకు పూనుకుంటుందని ఆరోపించారు. ఢిల్లీలో కంచెలు ఏర్పాటు చేయడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కార్పొరేట్ విధానాలను మానుకోవాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీసీఐ ఫ్యాక్టరికి కావాల్సిన ముడి సరుకు ఉన్నప్పటికీ కేంద్రం మూసి వేసిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జాదవ్ రాంకిషన్ నాయక్, నేతావత్ రాందాస్, బానోత్ రామారావు, బండి విజయ్‌కుమార్, జాదవ్ గోపాలరావు, కొసర్, మడావి లక్ష్మి కాంత్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: బౌద్ధ మహాసభ నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బుక్తే విఠల్‌ను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధవిహార్‌లో భారతీయ బౌద్ధమహా సభ జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్ పాట్పోడే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞాకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గౌతమ బుద్ధుని విగ్రహం, అంబేద్కర్, రమాబాయి అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. నాయకులు దయానంద్ కామ్లే, దయాబాయ్ హుక్కే, భారత్ గైక్వాడ, రాజు హట్కరే, అన్నారావు టిక్తే, నాందేవ్ గవడే, ఆత్మారాం భలేరావ్, ఆమ్రపాల దగ్డే, బేబీ కానిందే, లలితా కిల్లారే, మాయావతి ససానే పాల్గొన్నారు.

బోథ్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న ఆత్రం భాస్కర్‌ను సొనాలలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో గాజుల పోతన్న, విజయ భాస్కర్ రెడ్డి, భూమన్న, వేణుగోపాల్ రెడ్డి, సోయం బాపురావు, జగ్నక్ మారుతి, గుడాల శేఖర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ఆదిలాబాద్‌టౌన్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న దుర్గంట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల పెద్ద పోచమ్మ తల్లి ఆలయ గోపురం నిర్మాణం కోసం ఆదివారం తనవంతుగా రూ.51 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మామిడి లక్ష్మణ్, అధ్యక్షుడు బైన్వార్ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లుల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు సురేశ్, ఉప కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి సురేందర్, దుర్గం ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ కోసం ఎదురుచూపు

- ఆయిల్‌పాం రైతులకు ఇంకా జమకాని రాయితీ
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం



ధన్నూర్(బి) గ్రామం వద్ద ఆయిల్‌పాం తోట

బోథ్: ఆయిల్‌పాం వేసుకున్న ప్రతి రైతుకూ ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తుంది. మొక్కలు నాటిన నుంచే వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుంది. ప్రభుత్వం రైతులు ఆయిల్‌పాం సాగు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో అధికారులు గ్రామాల్లో తిరుగుతూ రైతులకు ఆయిపాం మొక్కలు పెంచడం వలన కలిగే లాభాలను వివరించారు. మొక్కలు నాటి నుంచి ఆయిల్‌పాం గింజలు విక్రయించే వరకు రైతులకు కలిగే లాభాలు తెలియజేశారు. రాయితీ కూడా రావడంతో రైతులు ఆయిల్‌పాం మొక్కలు నాటుకున్నారు.

రాయితీ అందాల్సిందిలా..

ఆయిల్‌పాం రైతులు మొక్కలు నాటుకుంటే ఎకరానికి రూ.11,600లను ప్రభుత్వం అందిస్తుంది. ఎకరంలో 57 మొక్కలు నాటాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన తరువాత మొక్కల పెంపకానికి సంబంధించి ప్రతి ఏటా ఎరువులు, అంతర పంటల సాగుకు రూ. 4200 చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 16,800లు ప్రభుత్వం అందిస్తుంది. బిందు సేద్యానికి వాటి పరికరాల కోసం రూ.22,518ల రాయితీ రైతులకు లభిస్తుంది. బిందుసేద్య పరికరాలకు నేరుగా కంపెనీలకు చెల్లించడంతో రైతులకు బిందుసేద్య పరికరాలు అందించారు. అయితే రాయితీ మాత్రం అందడం లేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి..

ఖమ్మం, అశ్వరావుపేటలో ఆయిల్‌పాం తోటలు వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. దీంతో ఇక్కడి అధికారులు ఆదిలాబాద్ జిల్లాలో తేమ ఎక్కువగా ఉండి, ఆయిల్‌పాం తోటకు అనుకూలంగా 37 వేల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయిల్‌పాం తోటలు వేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 2022– 23వ సంవత్సరంలో 1147 ఎకరాల్లో 336 మంది రైతులు ఆయిల్‌పాం తోట వేశారు. వీరికి బిందుసేద్యం పరికరాలను ప్రభుత్వం అందించింది. 2022–23 సంవత్సరానికి రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున అందించింది. కాగా రెండో విడత రాయితీ జులైలో అందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు రాయితీ అందలేదు. వీరితో పాటు 2023– 24 సంవత్సరంలో 298 మంది రైతులు 875 ఎకరాల్లో ఆయిల్‌పాం వేశారు. వీరికి కూడా మొదటి విడత నగదు అందలేదు. దీంతో మొత్తం రూ. 84 లక్షల 92 వేల 400లు 634 మంది రైతులకు అందాల్సి ఉంది.

రాయితీ అందించాలి



ఆరు ఎకరాల్లో అయిల్‌పాం తోట వేశాను. 2022లో రాయితీ డబ్బులు అందించారు. రెండో విడత డబ్బులు ప్రభుత్వం ఇంకా జమ చేయలేదు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే ఆయిల్‌పాం తోటల సాగు పెరుగుతుంది.

– రాసం నవీన్ కుమార్, బోథ్

వెంటనే జమ చేయాలి



అధికారులు ఆయిల్‌పాం వేయాలని అవగాహన కల్పించారు. 2022లో ఆయిల్‌పాం తోట వేశాను. ఇంకా రాయితీ సొమ్ములు అందలేదు. రాయితీని వెంటనే జమ చేయాలి. అధికారులకు అడిగితే జమ అవుతుందని చెబుతున్నారు.

– సోమ శంకర్, బోథ్

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. జామిడి గ్రామానికి చెందిన అడ్డి రమాబాయి గత రెండు రోజులు క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీ మండల నాయకులతో పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, కేశవ్ రెడ్డి, వెంకన్న, సదానంద్, తదితరులు పాల్గొన్నారు.